సాక్షి కర్నూలు

గురువారం | 24 | ఆగస్టు | 2023



సాక్షిగణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కల్యాణార్థమై బుధవారం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు.



సాంకేతికత.. పారదర్శకత

ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందు కోసం ఏపీఎస్పీ బెటాలియన్‌లో సాంకేతిక పరికరాలు ఏర్పాటు చేశారు.

IIలో▸



ఇద్దరు యువకులు మృతి

బండిఆత్మకూరు మండలం పార్నపల్లె సమీపంలోని కేసీ కాల్వలో పడి బుధవారం ఇద్దరు యువకులు మృతి చెందారు. వరినాట్ల కోసం వెళ్లగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

IIలో▸

న్యూస్‌రీల్

ధీశాలి ఆంధ్రకేసరి

- టంగుటూరి ప్రకాశం పంతులుకు నివాళి అర్పించిన కలెక్టర్



కర్నూలు(సెంట్రల్): బ్రిటీషు వారిని ఎదురించి నిలిచిన ధీశాలి ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు అని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకొని ఆయనచిత్ర పటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలోనూ టంగుటూరి ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఆయన దేశానికి, రాష్ట్రానికి చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం న్యాయవాద వృత్తిని వదులుకున్నారన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, బీసీ సంక్షేమాధికారి వెంకట లక్ష్మమ్మ పాల్గొన్నారు.

'ఉత్తమ' దరఖాస్తుకు నేడే ఆఖరు

కర్నూలు సిటీ: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు నేటి(గురువారం)సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ డా.వి రంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఎస్‌జీటీ కేటగిరి, స్కూల్ అసిస్టెంట్ క్యాటగిరీలకు చెందిన ఉపాధ్యాయులకు బోధనలో 10 సంవత్సరాల పాటు అనుభవం ఉండాలని పేర్కొన్నారు. గతంలో జిల్లాస్థాయి అవార్డులు పొందిన వారు అర్హులని, జాతీయస్థాయి అవార్డులు పొందిన, క్రమశిక్షణ చర్యలు పెండింగ్‌లో ఉన్న వారు అనర్హులని డీఈఓ వెల్లడించారు.

వేరుశనగ క్వింటా ధర రూ.8,350

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగకు బుధవారం అత్యధిక ధర లభించింది. మార్కెట్‌కు 109 లాట్‌ల వేరుశనగ వచ్చింది. కనిష్ట ధర రూ.3,660, గరిష్ట ధర రూ.8,350 ధర పలికింది. మోడల్ ధర రూ.5,960గా నమోదైంది. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 10 లాట్లకు గరిష్ట ధర రూ.8,350 ప్రకారం ధర లభించడం విశేషం. మార్కెట్ యార్డుకు 1,146 క్వింటాళ్ల వేరుశనగ వచ్చింది. నీటి తడులకింద సాగు చేసినందున మార్కెట్‌కు వచ్చే వేరుశనగలో నాణ్యత బాగా ఉంటోంది. కాగా ఉల్లి ధర తగ్గింది. కనిష్ట ధర రూ.1099, గరిష్ట ధర రూ.2,211 లభించింది. మార్కెట్‌కు ఉల్లి 191 క్వింటాళ్లు వచ్చింది.

ఐఐఐటీడీఎం రోడ్డు విస్తరణ

కర్నూలు(సెంట్రల్): జగన్నాథ గట్టుపై ఏర్పాటైన ఐఐఐటీడీఎంకు 4.93 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు కలెక్టర్ డాక్టర్ సృజన తెలిపారు. ఈ పనులు డిసెంబర్ 31వ తేదీలోపు పూర్తి చేస్తామని చెప్పారు. ఉన్నత స్థాయి విద్యా సంస్థలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్లతో బుధవారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఐఐఐటీడీఎం కల్పించిన వసతులపై కలెక్టర్ ఆయనకు వివరించారు.

చెరువును మింగిన విష్ణు!

- కొందరు అధికారుల సాయంతో ప్రభుత్వ భూమిని వశం చేసుకున్న టీడీపీ నేత ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి
- ఎకరం రూ.2 కోట్ల విలువ చేసే 3.60 ఎకరాల చెరువు భూమిలో పాగా
- అనుభవందారుల నుంచి బినామీకి అమ్మకం, అక్కడి నుంచి తన మనువళ్ల పేరిట రిజిస్ట్రేషన్
- చెరువులో సగభాగం తనదేనని జేసీబీలతో పూడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- పట్టా భూమి ఉండొచ్చని అధికారులు వత్తాసు పలకడంపై పలు అనుమానాలు

ఏళ్ల నాటి చెరువది.. ప్ర'జల' దాహార్తి తీరుస్తూ.. పొలాలకు నీటిని అందిస్తూ.. జాతి సంపదగా కీర్తి సంపాదించింది.. ఉన్నట్టుండి ఏమైందో ఏమో.. జేసీబీలు వచ్చాయి.. టిప్పర్లు మట్టిని దించాయి .. చెరువు భూమిని చదును చేస్తూ పనులు చకచకా సాగుతున్నాయి..ఆరా తీస్తే..ఇదంతా కోడుమూరుకు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి పనే అని తేలింది. కొందరు అధికారులను లోబరుచుకుని..తన మనవళ్ల పేరిట ప్రభుత్వ భూమిని వశం చేసుకుని జాతి సంపదకు తూట్లు పొడుస్తున్నారు. యథేచ్ఛగా కబ్జా పర్వాన్ని కొనసాగిస్తున్నారు.



మట్టితో పూడ్చడంతో కేజీ రోడ్డు పక్కనే కుచించుకుపోయిన గార్గేయపురం చెరువు



టిప్పర్‌తో చెరువులో ఎర్రమట్టి నింపుతున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్/న్యూటౌన్): జిల్లా కేంద్రమైన కర్నూలుకు సమీపంలోని నగరవనం వద్ద కర్నూలు–గుంటూరు రోడ్డుకు ఆనుకుని ఉన్న గార్గేయపురం చెరువు టీడీపీ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి భూదాహానికి బలైపోతోంది. రుద్రవరం, నందనపల్లె రెవెన్యూ గ్రామాల పరిధిలో ఈ చెరువు నీటితో రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. నందనపల్లె, మిలిటరీ కాలనీ, పడిదెంపాడు, పూడూరు, గార్గేయపురం గ్రామ ప్రజలు తాగునీటి అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న చెరువు అకస్మాత్తుగా వేరొకరి వశం కావడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తన మనవళ్ల పేరుతో భూమి ఉందని చెప్పి టీడీపీ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి పది రోజులుగా చెరువును పూడ్చి వేస్తున్నా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.పైగా చెరువులో పట్టా భూమి ఉండవచ్చని ఆయనకే సానుభూతిని తెలుపుతున్నారు.

అనుభవదారుల నుంచి నడిచిన కబ్జా కథ

కర్నూలు రూరల్ మండలం రుద్రవరం, నందనపల్లె రెవెన్యూ గ్రామాల పరిధిలో 214/2, 609, 661, 672, 704 సర్వే నంబర్లలో గార్గేయపురం చెరువు ఉంది. దీనికి అనుకుని 673-1ఏలో 1.15 ఎకరాలు, 673-1బీలో 1.15 ఎకరాలు, 673/2లో 1.39 ఎకరాలు, 673/3లో 2.26 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 673-1ఏలో గద్ద దానమ్మ, 673-1బీలో గద్ద సత్తానియేల్, 673/2లో మంగలి శ్రీనివాసులు, ఎం.తిరుపాలయ్య, 673/3లో కె.పాపమ్మలు చెరువుకు నీళ్ల రాని సమయాల్లో కళింగర, పుచ్చకాయ, కర్బూజ వంటి పంటలను వేసుకొని జీవనాధారం చేస్తున్నారు. వీరిని అనుభవం దారులుగా గుర్తించి గతంలో రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసుపుస్తకాలను ఇచ్చారు. అయితే వీరు కేవలం అనుభవందారులే. ఈ భూమిని అమ్ముకోవడానికి వీరికి ఎలాంటి హక్కులు ఉండవు. అయితే అనుభవదారుల నుంచి ఆ భూములను సులభంగా కొట్టేసేందుకు టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. వెంటనే తన బినామీ అయిన సుంకేసులకు చెందిన రేపల్లె సుధాకర్‌ను కథలోకి తీసుకొచ్చారు. మంగలి శ్రీనివాసులు, ఎం.తిరుపాలయ్య ఆధీనంలో ఉన్న 1.3 ఎకరాలను (సర్వే నంబర్ 673/2లో) రేపల్లె సుధాకర్ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. అలాగే గద్ద దానమ్మ, గద్ద సత్తానియేల్ అనుభవంలో ఉన్న 2.30 ఎకరాలు (673-1ఏ, 1బీ సర్వే నంబర్లలో) కూడా రేపల్లె సుధాకర్ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. రేపల్లె సుధాకర్ నుంచి 373-2లోని 1.3 ఎకరాలను ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి మనువడు సూర్యవర్ధన్‌రెడ్డి(మైనర్), ఇతని తల్లి పులకుర్తి సౌజన్యను గార్డెన్‌గా పెట్టి రిజిస్ట్రేషన్ చేశారు. అలాగే 373-1ఏ, 1బీలలోని 2.30 ఎకరాలను మరో మనువడు ఆదిత్యవర్ధన్‌రెడ్డి(మైనర్), అతని తల్లి సౌజన్యను గార్డెన్‌గా పెట్టి రిజిస్ట్రేషన్ చేసి తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు.

కారు చౌకగా రూ. 7.20 కోట్ల భూమి


కర్నూలు–విజయవాడ జాతీయ రహదారిని అనుకొని ఉన్న భూములకు మంచి డిమాండ్ ఉంది. మార్కెట్‌లో వీటి రేటు చాలా ఎక్కువగా ఉంది. ఎకరం రూ.2కోట్ల వరకు అమ్ముడవుతున్నాయి. ఈ లెక్కన విష్ణువర్ధన్‌రెడ్డి మనువళ్ల పేరిట ఉన్న భూములకు దాదాపు రూ. 7.20 కోట్లు విలువ ఉంటుంది. కారు చౌకగా విలువైన భూమిని కాజేశారు. తన మనువళ్ల భూమి ఉందని రేయింబవళ్లు పదుల సంఖ్యలో జేసీబీలు, టిప్పర్లతో సమీపంలోని కొండలు, గుట్టలను తవ్వి అక్రమంగా ఎర్రమట్టితో చెరువును చదును చేస్తున్నారు.

నోరు మెదపని అధికారులు

గార్గేయపురంలో దాదాపు సగం చెరువు వరకు తన మనువళ్ల పేరిట ఉందని పూడ్చే పనిలో టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నా అధికారులు తమకు తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. చెరువులో పట్టా భూమి ఉండవచ్చని చెబుతున్నారు. అధికారులు స్పందించి నిలుపుదల చేయకపోతే చెరువు సగం భాగం వరకు కబ్జా కోరల్లోకి వెళ్లడం అతి దగ్గర రోజుల్లోనే చూడాల్సి వస్తుంది.

కళ్లుమూసుకుని రిజిస్ట్రేషన్!

కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని సబ్ రిజిస్ట్రార్ ప్రభుత్వ భూములను కళ్లు మూసుకొని రిజిస్ట్రేషన్ చేశారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను విష్ణువర్ధన్‌రెడ్డి మనవళ్లతోపాటు, అంతక ముందు రేపల్లే సుధాకర్ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. రేపల్లె సుధాకర్, విష్ణువర్ధన్‌రెడ్డి మనువళ్ల పేరిట రిజిస్ట్రేషన్ జరిగిన సమయాల్లో కేవలం ఆరు నెలల వ్యవధి ఉండడం అనుమానాలకు తావిస్తోంది. 2022లో రేపల్లె సుధాకర్ పేరిట 7766/2022, 7767/2022 డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లను చేశారు. అలాగే 2023లో 5999/2023, 5998/2023 డ్యాకుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేశారు.



విష్ణువర్ధన్‌రెడ్డి మనువడు ఆదిత్యవర్ధన్ రెడ్డి పేరిట రిజిస్ట్రేషన్ అయిన 673-1ఏ, 1బీ సబ్ డివిజన్‌లు ఇప్పటికీ ప్రభుత్వ భూమిగా ఉన్న దృశ్యం



ఆన్‌లైన్ అడంగల్‌లో 673 సర్వేలోని డివిజన్లన్నీ ప్రభుత్వ భూమిగా ఉన్న దృశ్యం

యథేచ్ఛగా చెరువు పూడ్చివేత

ఒక వేళ మన ఆస్తి ఎక్కడుందో తెలియకపోతే సర్వే చేయించి హద్దులు గుర్తించుకుంటాం. అయితే గార్గేయపురం చెరువులో మాత్రం విష్ణువర్ధన్‌రెడ్డి తన తెలివిని ఉపయోగించి అధిక రేటు వచ్చే రోడ్డు వైపే తన భూమి ఉన్నట్లు ఆయనకు ఆయనే సర్వే చేయించుకున్నారు. కర్నూలు–విజయవాడ జాతీయ రహదారిని అనుకొని తన పొలం ఉన్నట్లు చెరువును పూడ్చుతున్న వైనాన్ని గమనిస్తే తెలిసిపోతుంది.

చెరువును ఆక్రమిస్తే చర్యలు తప్పవు

గార్గేయపురం చెరువును ఆక్రమిస్తే ఎంతటివారైనా చట్టపరంగా చర్యలు తప్పవు. గతంలో ఇక్కడ ఎక్స్ ఆర్మీ వారికి పట్టాలు ఇచ్చినట్లు తెలిసింది. అయితే అంతకు మునుపే ఇది చెరువు భూమిగా ఉంది. ఎలాంటి సర్వేలు చేయకుండానే చెరువు భూమిని ఆక్రమించుకోవడం చట్టరీత్యా నేరం. పూర్తిస్థాయిలో విచారణ చేయించి ఆక్రమణలు రుజువైతే బాధ్యులపై చర్యలు చేపడతాం.

– ఆర్.శివరాముడు, కర్నూలు రూరల్ తహసీల్దార్

పల్లెల్లో ఆస్తులకు యాజమాన్య హక్కులు

- పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): గ్రామ కంఠం పరిధిలోని అన్ని ఆస్తులను గుర్తించి వాటికి యాజమాన్య హక్కులు కల్పించడంతో పాటు ధ్రువపత్రాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'స్వామిత్వ' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి అన్నారు. ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ ఆదేశాల మేరకు స్థానిక జెడ్పీలోని డీపీఆర్‌సీ భవనంలో కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. రెండు జిల్లాల్లోని ప్రతి మండలం నుంచి ఒక కార్యదర్శికి స్వామిత్వపై రెండు రోజుల పాటు శిక్షణను ఇస్తున్నారు. ఈ కార్యక్రమానికి కర్నూలు, నంద్యాల జిల్లాల పంచాయతీ అధికారులు టీ నాగరాజునాయుడు, ఎస్ మంజులావాణి, శిక్షకులు ఎస్‌జీ నాగేష్, మహీధర్‌రెడ్డి హరి, హుసేన్, పరమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ సర్వే సెటిల్‌మెంట్ భూ రికార్డుల కమిషనర్ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా డ్రోన్ల ద్వారా గ్రామ కంఠం రీ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. రీ సర్వేలో అనేక అంశాలకు సంబంధించిన వివరాలను నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఈ సర్వేకు సంబంధించి డివిజన్ల వారీగా ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చామన్నారు. పక్కా ప్రణాళిక ప్రకారం ఈ కార్యక్రమాన్ని నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు మరో సారి ప్రభుత్వం శిక్షణను ఇస్తున్నదన్నారు. డీపీఓ నాగరాజునాయుడు మాట్లాడుతూ గ్రామాల్లోని ఆస్తులకు సంబంధించి సర్వే నంబర్, యజమాని పేరు, తండ్రి పేరు, విస్తీర్ణం, కొలతలు, సరిహద్దులు తదితర పలు విషయాలను పొందు పరుస్తారన్నారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి అయిన అనంతరం హక్కు పత్రాలను కూడా అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే కర్నూలు జిల్లాలోని పలు గ్రామాల్లోని ప్రజలకు హక్కు పత్రాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి

అర్హులైన వారందరికీ లబ్ధి

- నేడు రూ.6.75 కోట్ల నగదు బదిలీ
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరంలో అర్హత ఉన్నా వివిధ కారణాల వల్ల లబ్ధిపొందని వారి బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా నేడు(గురువారం) ప్రభుత్వం నగదును బదిలీ చేయనుందని జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తారన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం జగనన్న అమ్మ ఒడి, జగనన్న చేదోడు, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ నేతన్న నేస్తం, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు, వైఎస్సార్ ఆసరా (ఎస్‌హెచ్‌జీఎస్) పథకాలను అమలు చేసింది. ఈ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నా, పలు కారణాల వల్ల జిల్లాలో 5,305 మందికి లబ్ధి చేకూరలేదు. ఈ నేపథ్యంలోనే గతంలో లబ్ధి పొందని వారి ఖాతాలకు రూ.6,75,21,840 ప్రభుత్వం జమ చేయనుంది.

అంబరాన్నంటిన ఆనందం: చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం అనంతరం కర్నూలు టౌన్ మోడల్ హైస్కూల్ విద్యార్థుల ఆనంద హేల



గ'ఘన' సంబరం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో బుధవారం సాయంత్రం జిల్లా అంతటా సంబరాలు మిన్నంటాయి. ప్రయోగాన్ని వీక్షించేందుకు వీలుగా పలు పాఠశాలల్లో ఎల్‌ఈడీ టీవీలను ఏర్పాటు చేశారు. సాయంత్రం 5.44 గంటల నుంచి సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియను మొదలు పెట్టిన ఇస్రో 6.03 గంటలకు చంద్రుడిపై సేఫ్‌గా విక్రమ్ ల్యాండర్‌ను దించి సరికొత్త చరిత్ర సృష్టించింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. పలుచోట్ల జాతీయ జెండాలతో ర్యాలీలు నిర్వహించారు. ఇస్రో విజయాన్ని కీర్తిస్తూ చిత్రకారులు పలు చిత్రాలు గీశారు. – కర్నూలు సిటీ



విజయ సంకేతాన్ని చూపుతున్న డీఈఓ రంగారెడ్డి



ఉపాధ్యాయుడికి స్వీటు తినిపిస్తున్న విద్యార్థులు

చాలా సంతోషంగా ఉంది



గత నెలలో చంద్రయాన్-3 పేరుతో రాకెట్‌ను పంపిన రోజు మేమంతా టీవీల్లో ప్రత్యక్షంగా వీక్షించాం. రాకెట్ ఎలా పంపిస్తారు అనేది తెలుసుకున్నాం. బుధవారం సాయంత్రం చంద్రుడిపై ఉపగ్రహం దిగిన దృశ్యాలను వీక్షించడం చాలా సంతోషంగా ఉంది.

– రహిమ తున్నీషా, 10వ తరగతి, టౌన్ మోడల్ హైస్కూల్, కర్నూలు

ఇస్రో సెంటిస్ట్‌లకు సెల్యూట్



చంద్రయాన్–3ని ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కలగడం చాలా ఆనందంగా ఉంది. ఇంత గొప్ప ఘనతను సాధించిన ఇస్రో సెంటిస్ట్‌లను సెల్యూట్ చేస్తున్నాం.

– ఎం.సంతోషి, 10వ తరగతి,టౌన్ మోడల్ హైస్కూల్, కర్నూలు

పెరిగిన ఇస్రో కీర్తి

కర్నూలు(అర్బన్): చంద్రయాన్ –3 సక్సెస్‌తో ఇస్రో కీర్తి పెరిగిందని, భారతదేశ శాస్త్రవేత్తల ప్రతిభ ప్రపంచ వ్యాప్తంగా తెలిసిందని జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత దేశం విశిష్టమైన స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు. ఈ విజయంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.



హొళగుంద జెడ్పీ హైస్కూల్ కన్నడ ఉపాధ్యాయుడు తిప్పేస్వామి గీచిన చిత్రం

ముక్తిదాయకం.. పాదోదకం!

- పవిత్ర తీర్థంగా పాదోదకం, హస్తోదకం, గంధోదకం
- విశిష్ట సేవనంగా రాయరు తీర్థ ప్రసాదాలు




శిరస్సున సంప్రోక్షణ చేసుకుంటూ..



భక్తులకు తీర్థ జలాన్ని వితరణ చేస్తున్న అర్చకుడు

శ్రీరాఘవేంద్రస్వామి తీర్థ ఉదకములు (జలాలు)కు ప్రత్యేక విశిష్టత ఉంది. రాయరు తీర్థాలను భక్తులు పరమ పవిత్రంగా స్వీకరిస్తారు. శ్రీమఠంలో పాదోదకం, హస్తోదకం, గంధోదకములకు ప్రశస్తి ఉంది. ఎంతో పరమ నైష్ఠికంగా భక్తులు తీర్థ ప్రసాదాల నియమాలను పాటించడం ఆనవాయితీగా వస్తోంది. రాఘవేంద్రుల 352వ ఆరాధన సప్తరాత్రోత్సవాల సందర్భంగా మూడు తీర్థాల విశిష్టతపై సాక్షి ప్రత్యేక కథనం.. – మంత్రాలయం



'' మంత్రం తే మంత్రాలయధామస్ భువి జప్తుః పాతుః పాదాంభో లఘు నశ్యతి అతిదుఃఖమ్''

– కృష్ణావధూత

తాత్పర్యం : మంత్రాలయ క్షేత్రంలో విరాజమానులైన రాఘవేంద్రస్వామి పాదోదకము స్వీకరించిన దుఃఖములు తక్షణమే నాశనం అగును.

హస్తోదకం

రాఘవేంద్రుల మూల బృందావనం, మృత్తికా, లోహ బృందావనాలకు నివేదించిన అన్నపానాదులను యతి హస్తోదకంగా పేర్కొంటారు. తీర్థలు, ప్రసాదాలను హస్తోదకంగా పేర్కొంటారు.

'' గురుపాదోదక గురూచ్ఛిష్ట భుంజసి ! గురువంతరయామి బాదరాయణ విఠ్ఠలన నంబు !!'' అంటూ యతి పాదోదకాన్ని సేవించి హస్తోదకాన్ని (నైవేద్య పదార్థాలు) భుజించాల్సి ఉంటుంది. ఇక్కడ కొందరు భక్తులు 1, 3, 5, 7, 14, 21, 42 రోజుల చొప్పున సేవలో తరిస్తారు. సేవా భక్తులు కచ్చితంగా హస్తోదక, పాదోదక నియమాలు పాటిస్తారు. రాఘవేంద్రస్వామి నైవేద్యంగా ఉంచిన హస్తోదక శేష పదార్థాలను అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాదం తయారీకి వినియోగించడం ఆనవాయితీ. సద్గురు పాదాల చెంత నుంచి రావడంతో అన్నపాన, ప్రసాదాలను పరమ పవిత్రంగా స్వీకరిస్తారు.

పాదోదకం

'' కరోమి తవ సిద్ధస్య బృందావనగతం జలం ! శిరసా ధారయామ్యద్య సర్వతీర్థఫలాప్తయే !!''

తాత్పర్యం: బృందావనానికి అభిషేకం చేసిన పాదోదకమును శిరసాధారణ చేస్తే సర్వ తీర్థ ఫలం సిద్ధించును.

రాఘవేంద్రస్వామి స్తోత్రం పఠిస్తూ అభిషేకం చేసిన జలాన్ని పాదోదకం అంటారు. సకల దేవతల నెలవుగా బృందావన అభిషేకం చేసిన ఈ జలం ఎంతో మహిమాన్వితంగా భక్తులు భావిస్తారు. భక్తులు సేవకు ఉపక్రమించే ముందు కచ్చితంగా పాదోదక స్నానం చేయాలి. రాయరుకు అభిషేకం చేసిన పాదోదకాన్ని చెంబులో తీసుకెళ్లి నదీ స్నానం చేయాల్సి ఉంటుంది. స్నానం చేసేటప్పుడు శరీర సగ భాగం నీటిలో మునగాలి. పాదోదకాన్ని పాదాలపై పడకుండా శిరస్సున సంప్రోక్ష చేసుకుని స్నానం ఆచరించాలి. అభిషేకించిన పాదోదకాన్ని దర్శనం చేసుకున్న భక్తులకు తీర్థంగా వితరణ చేస్తారు. భక్తులు జలాన్ని స్వీకరించడం తలపై సంప్రోక్షణ చేసుకోవడం చేస్తారు.

గంధోదకం

రాఘవేంద్రుల బృందావనానికి బంగారు నామ ముద్రలు (ఇంద్రియ రూపాలు) అలంకరించడం తెలిసిందే. నామ ముద్రలు బృందావనాన్ని అంటిపెట్టుకుని ఉండేందుకు గంధంతో అలంకరిస్తారు. రాయరు పూజా కైంకర్యాలు ముగిసిన తర్వాత రాత్రి బంగారు నామ ముద్రలను జలంలో కలుపుతారు. బృందావన స్పర్శతో పవిత్రమైన శ్రీగంధం జలమునే గంధోదకం అంటారు. రాయల అలంకారములు పూర్తిగా తొలగించిన 15 నిమిషాలకు గంధోదకాన్ని భక్తులకు వితరణ చేస్తారు. గంధోదక వితరణతో శ్రీమఠంలో పూజలకు శుభం పలుకుతారు.

తీర్థ జలాలు ఎంతో పవిత్రం



ప్రహ్లాదరాయల ప్రతిరూపమైన రాఘవేంద్రస్వామికి అభిషేకించిన జలాలను పాదోదకం, హస్తోదకం, గంధోకంగా పిలుస్తారు. ఇక్కడ తీర్థాలను పరమ పవిత్రంగా భక్తులు స్వీకరిస్తారు. రోగ పీడితులు పాదోదకం సేవిస్తే ఉపశమనం లభిస్తుంది. భక్తులు దృఢ విశ్వాసంతో తీర్థాలను సేవనం చేస్తారు. ఎందరో యతి వరేణ్యులు పాదోదక విశిష్టతను స్తోత్రాల రూపంలో అభివర్ణించారు.

– సుబుధేంద్రతీర్థులు, పీఠాధిపతి

పశుసంవర్ధకశాఖ ఏడీలకు డీడీలుగా పదోన్నతి

- బనవాసి ఘనీకృత వీర్య కేంద్రం డీడీగా శ్రీనివాసరావు
- నంద్యాల డీఏహెచ్ఓగా గోవిందనాయక్


గోవిందనాయక్

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధకశాఖలో సహాయ సంచాలకులు(అసిస్టెంటు డైరెక్టర్)గా పని చేస్తున్న పలువురికి ఉప సంచాలకులు(డిప్యూటీ డైరెక్టర్)గా పదోన్నతులు లభించాయి. రాష్ట్రం మొత్తం మీద 24 మంది ఏడీలకు పదోన్నతులు లభించగా.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇద్దరు ఏడీలకు పదోన్నతి దక్కింది. పదోన్నతిపై ఇతర జిల్లాల నుంచి ఇద్దరు ఉమ్మడి జిల్లాకు రానున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేస్తున్న డాక్టర్ డి.శ్రీనివాసరావు పదోన్నతిపై బనవాసి ఘనీకృత వీర్యకేంద్రం డిప్యూటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న డాక్టర్ బి.గోవిందనాయక్‌ను నంద్యాల జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి(డీఏహెచ్‌వో)గా నియమించారు. ప్యాపిలి ఏవీహెచ్ ఏడీగా పనిచేస్తున్న డాక్టర్ పి.వెంకటరమణమూర్తిని పదోన్నతిపై నంద్యాల డివిజన్ డిప్యూటీ డైరెక్టర్‌గా.. చాగలమర్రి ఏవీహెచ్ ఏడీ డాక్టర్ ఎంవై వరప్రసాద్‌ను పదోన్నతిపై రంపచోడవరం డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించారు.

కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీరు



గూడూరు: సుంకేసుల జలాశయం నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో నిలిచిపోగా డ్యాంలో 0.813 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సాంకేతికత.. పారదర్శకత

రేపటి నుంచి ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు
- ఏపీఎస్పీ రెండో పటాలంలో ఏర్పాట్లు


పరుగు పందెం కోసం ఏర్పాటు చేసిన ఆర్ఎఫ్ఐడీ

కర్నూలు: పోలీసు కొలువు సాధించే ప్రక్రియలో భాగంగా దేహదారుఢ్య పరీక్షలు అత్యంత కీలకం. ప్రాథమిక(ప్లిమినరీ) పరీక్ష అర్హత సాధించిన వారంతా తమ కలను సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ నెల 25 తేదీ నుంచి దేహదారుఢ్య పరీక్షలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో కర్నూలులోని ఏపీ ఎస్పీ రెండో బెటాలియన్ మైదానాన్ని సిద్ధం చేశారు. సీసీ కెమెరాలతో పాటు ఇతర సాంకేతిక పరికరాలు ఏర్పాటు చేశారు.

బయోమెట్రిక్ హాజరుతో మొదలు:
అభ్యర్థులు మైదానంలోకి రావాలంటే అడ్మిట్ కార్డు తప్పనిసరి. ఆ తరువాత హాజరు బయోమెట్రిక్ పద్ధతిలో తీసుకుంటారు. వేలి ముద్రలు, ఫొటో, కేటాయించే టోకన్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఎంపిక విధానాన్ని సీసీ కెమెరాల ద్వారా చిత్రీకరించనున్నారు. అనుమానితులు ఎవరైనా వస్తే విచారిస్తారు. అభ్యర్థుల ఫోన్‌లు, ఇతర వస్తువులను అనుమతించరు. ఉదయం 5గంటల నుంచే మైదానంలోకి పంపిస్తారు. ఈ మేరకు షామియానాలు, వైద్య శిబిరం, ఇతర మౌలిక వసుతులు కల్పించారు.

16,108 మంది: కర్నూలులో 27 రోజుల పాటు జరిగే ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలకు 16,108 మంది హాజరు కానున్నారు. వీరిలో 14,011 మంది పురుషులు, 2,097 మంది మహిళలు ఉన్నారు. కర్నూలు జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాల అభ్యర్థులు ఇందులో ఉన్నారు. శారీరక సామర్థ్య పరీక్షలు, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్(పీఎంటీ) పక్బందీ నిర్వహణపై కసరత్తు పూర్తయింది. పారదర్శకతకు పెద్దపీట వేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థుల ఎత్తు కొలిచేందుకు డిజిటల్ మీటర్లు వినియోగిస్తున్నారు. పరుషులకు 1600 మీటర్లు, మహిళలకు 800 మీటర్ల పరుగుపందెం నిర్వహించనున్నారు. మైదనంలోకి అడుగుపెట్టిన వెంటనే అభ్యర్థికి ఆర్ఎఫ్ఐడీ (రేడియోఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ రీడర్) పరిజ్ఞానంతో కూడిన బ్యాండ్ తగిలిస్తారు. వీటిన్నింటినీ పోలీసు నియామక మండలి బోర్డు సర్వర్‌లో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తారు.

పరుగులో ఆర్ఎఫ్ఐడీ:
ట్రాక్‌లో పరుగు పెట్టే సమయంలో గుర్తించేందుకు వీలుగా ఆర్ఎఫ్ఐడీని వినియోగిస్తున్నారు. అభ్యర్థులు ఆర్ఎఫ్ఐడీని తప్పనిసరిగా ధరించాల్సి ఉంటుంది. ఎంత సమయంలో పరుగు పూర్తి చేశారో కచ్చితమైన సమయం దీని ద్వారా నిర్ధారణ అవుతుంది. దీనికి తోడు ట్రాక్ వెంట సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తారు.

ఏ పరీక్షలను ఎంత సమయంలో పూర్తి చేయాలంటే...

పరీక్ష	పురుషులు	మహిళలు	మాజీ సైనికులు
1600 మీటర్ల పరుగు	8 నిమిషాలు	10నిమిషాల 30 సెకండ్లు	9నిమిషాల 30 సెకండ్లు
100 మీటర్ల పరుగు	15 సెకండ్లు	18 సెకన్లు	16.5 సెకండ్లు
లాంగ్ జంప్	3.80 మీటర్లు	2.75 మీటర్లు	3.65 మీటర్లు


దేహదారుఢ్య పరీక్షల వద్ద ఏర్పాట్లు చేసిన సాంకేతిక పరిజ్ఞానం గురించి అడిగి తెలుసుకుంటున్న డీఐజీ


మైదానంలో ఏర్పాట్లు చేసిన సీసీ కెమెరాలు

ఎత్తు బరువు చెప్పే యంత్రం
ఎత్తు, బరువును కొలిచేందుకు వేరువేరుగా పరిశీలించే వారు. పరికరం వద్ద అభ్యర్థులు నిల్చుంటే ఎత్తును సిబ్బంది పరిశీలించేవారు. ఈ సారి ఆ విధానానికి స్వస్తి పలికి, డిజిటల్ యంత్రం అందుబాటులోకి తెచ్చారు. దీనిపై అభ్యర్థి నిల్చుంటే ఎత్తు, బరువు ఒకేసారి రీడింగ్ చూపుతుంది. ఈ ప్రక్రియ అంతా కెమెరాల్లో రికార్డు అవుతుంది.

శారీరక కొలతల పరీక్ష:
పీఎంటీ అర్హత కోసం పురుషులు 167.6 సెంటి మీటర్లు, మహిళలు 152.5 సెంటీమీటర్ల కంటే తక్కువ ఎత్తు ఉండరాదు. పురుషుల ఛాతీ చుట్టూ కొలత 86.3 సెంటీ మీటర్ల కంటే తక్కువ ఉండకూడదు. శ్వాస పీల్చినప్పుడు ఛాతీ 5 సెంటీమీటర్ల మేర విస్తరించాలి. మహిళల బరువు 40 కిలోల కంటే తక్కువ ఉండకూడదు.

ఏర్పాట్లను పరిశీలించిన డీఐజీ, ఎస్పీ


ఛాతీ, ఎత్తు కొలతల పరికరాన్ని పరిశీలిస్తున్న డీఐజీ

కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో బుధవారం ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల ఏర్పాట్లు పరిశీలించి అక్కడున్న అధికారులకు పలు సూచనలు, దిశానిర్దేశం చేశారు. పోలీసు నోటిఫికేషన్ ప్రకారం 25 నుంచి సెప్టెంబరు 20తేదీ వరకు ఈవెంట్స్ జరుగుతాయని డీఐజీ స్పష్టం చేశారు. సమస్యలపై అప్పీల్ చేసే వారు రిక్విజిషన్ రాసిచ్చి సెప్టెంబర్ 21 తేదీన రావాలని తెలిపారు. 1600 మీటర్ల రన్నింగ్ చేయకపోతే ఎస్ఐ ఈవెంట్స్ నుంచి డిస్‌క్వాలిఫై చేస్తారన్నారు. అడిషనల్ ఎస్పీలు టి.సర్కార్, జి.నాగబాబు, డీఎస్పీలు విజయశేఖర్, యుగంధర్ బాబు, ఇలియాస్ బాసా, కృష్ణ మోహన్, డీపీఓ ఏఓ సురేష్‌బాబు, తూనికల కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోల్ శ్రీరాములు తదితరులు డీఐజీ వెంట ఉన్నారు.

దాస సాహిత్యంతో దైవ చింతన


ప్రసంగిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: దైవ చింతనకు దాస సాహిత్యం దోహదపడుతోందని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఉద్ఘాటించారు. బుధవారం శ్రీమఠం దాస సాహిత్య ప్రాంగణంలో శ్రీరామ భజన మండలి మహిళలు ప్రదర్శన చేశారు. హరిసర్వోత్తముడు శ్రీహరి సంకీర్తనలు, రాఘవేంద్రస్వామి భక్తి గేయాలాపనలు వీనుల విందు చేశాయి. ఈ సందర్భంగా స్వామిజీకి భజన మండలి నిర్వాహకులు గౌరవ సత్కారం చేసుకున్నారు. స్వామిజీ ప్రవచిస్తూ దాస సాహిత్యంతో ఎందరో మహానుభావులు దేవుని సేవలో తరించారని గుర్తు చేశారు. దాస సేవతో దేవుళ్లను సైతం ప్రసన్నం చేసుకున్నారని వివరించారు. వేడుకలో శ్రీమఠం మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, సంస్కృత విద్యాపీఠం మాజీ ప్రధానాచార్యులు వాదిరాజాచార్, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్ పాల్గొన్నారు.

కాలుష్య రహిత పరిశ్రమలకే ప్రాధాన్యం


సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే కాటసాని, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటుకే అధిక ప్రాధాన్యత ఇస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కందికాయపల్లె గ్రామంలో గ్రీన్‌కో ఆధ్వర్యంలో రూ.4,500 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సోలార్, విండ్ ప్రాజెక్టులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాలు తీసుకుంటారన్నారు. అందులో భాగంగా ఏర్పాటవుతున్న ఈ పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. గ్రామంలో చేపడుతున్న సోలార్, విండ్ పరిశ్రమల వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వమని చెప్పారు. అలాగే కందికాయపల్లె గ్రామాభివృద్ధికి పూర్తి బాధ్యత తీసుకుంటామన్నారు.

అన్నా ఎలా ఉన్నారు.. కాటసానికి సీఎం పలకరింపు
సోలార్ పరిశ్రమల శంకుస్థాపనను తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాణ్యం ఎమ్మెల్యే కాటసానిని ఆప్యాయంగా పలకరించారు. లైవ్‌లో ఎమ్మెల్యేను చూసి అన్నా ఎలా ఉన్నారని అడిగారు. అలాగే ఈకార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులను కూడా అందరు బాగున్నారా అని పలకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, పాణ్యం ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ రామచంద్రుడు, ఎంపీటీసీ సభ్యులు రమణయ్య, జయచంద్రారెడ్డి, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, గ్రీన్‌కో అధికారులు పాల్గొన్నారు.

బీఎల్ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి పరిశీలించాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): ఓటరు జాబితా సంక్షిప్త సవరణ–2024లో భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించాలని, ఎవరైనా తమ ఇంటికి రాలేదని ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ జి.సృజన హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ తన చాంబరులో స్పెషల్ సమ్మరీ రివిజన్ –2024పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సర్వేకు సంబంధించి 98 శాతం ఓటర్ల వివరాలను పరిశీలించామని, అయితే అందులో ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఓటర్ల వివరాలు మాత్రం 78 శాతంగా ఉన్నట్లు చెప్పారు. మిగిలిన రెండు శాతం సర్వేతోపాటు మిగిలిన ఓటర్ల వివరాలను త్వరగా పరిశీలించి ఆన్‌లైన్లో బీఎల్ఓ యాప్‌లో నమోదుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అంతకముందు రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి ఆమె సలహాలు, సూచనలు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ నుంచి పుల్లారెడ్డి, కాంగ్రెస్ నుంచి సత్యనారాయణగుప్తా, బీఎస్పీ నుంచి జి.అరుణ్‌కుమార్, టీడీపీ నుంచి ఎల్వీ ప్రసాదు, బీజేపీ నుంచి నరసింహవర్మ, సీపీఎం నుంచి ఎం.రాజశేఖర్, ఎన్నికల సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎస్ఈ నాగరాజు

కర్నూలు (న్యూసిటీ): రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కర్నూలు, నంద్యాల, ఆదోని ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లను ఎస్ఈ నాగరాజు ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్‌డీబీ (న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్) ఆధ్వర్యంలో రోడ్ల పనులు కొన్నిచోట్ల నత్తనడకన సాగడం, మరికొన్ని చోట్ల పనులు మొదలు పెట్టకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రామళ్లకోట–బేతంచెర్ల రోడ్డు నిర్మాణ పనులు మూడు నెలల్లో పూర్తి చేస్తామని నంద్యాల ఈఈ శ్రీధర్ రెడ్డి చెప్పారు. రోడ్డు పనులకు సంబంధించిన్ల డాక్యుమెంటేషన్‌ను తీసుకురాకపోవడంతో కాంట్రాక్టర్లపై ఎస్ఈ నాగరాజు మండిపడ్డారు. కార్యక్రమంలో కర్నూలు డీఈ సురేష్‌బాబు, ఆదోని డీఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కేసీలో పడి ఇద్దరు యువకులు మృతి

- పార్నపల్లె, కరిమద్దెల గ్రామాల్లో విషాదం


మృతి చెందిన గోపినాథరెడ్డి, సతీష్

మహానంది: కేసీ కాల్వలో పడి ఇద్దరు యువకులు మృతి చెందారు. బాధిత కుటుంబాల్లో విషాదం నింపిన ఈ ఘటన బండిఆత్మకూరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు...బండిఆత్మకూరు మండలం పార్నపల్లెకు చెందిన గోపినాథ్‌రెడ్డి(35) తన పొలంలో వరినాట్ల కోసం ఓ ప్రైవేటు స్కూల్ వ్యానుకు క్లీనర్‌గా చేస్తున్న గడివేముల మండలం కరిమద్దెలకు చెందిన సతీష్(16)తో పాటు మరో ఇద్దరితో కలిసి వెళ్లారు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో సతీష్ కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు కేసీ కాల్వలో దిగాడు. ప్రమాదవశాత్తు నీటిలో జారి కొట్టుకుపోయాడు. గమనించిన గోపినాథ్‌రెడ్డి కాపాడేందుకు కాల్వలో దిగగా అతను కూడా నీటి ప్రవాహానికి కొట్టుకునిపోయాడు. బంధుమిత్రులు మృతదేహాల కోసం గాలించగా సాయంత్రం శింగవరం సమీపంలోని కాల్వలో తేలారు. ఇద్దరి మృతితో పార్నపల్లె, కరిమద్దెల గ్రామాల్లో విషాదం నెలకొంది. ఇదిలా ఉండగా ప్రైవేటు స్కూల్ బస్సుకు గోపినాథరెడ్డి డ్రైవర్‌గా చేస్తుండగా, సతీష్ క్లీనర్‌గా చేస్తున్నారని, మా కుమారుడిని పొలం పనులకు ఎందుకు తీసుకెళ్లారని కుటుంబ సభ్యుల ఆందోళనకు దిగారు. ఎస్ఐ మల్లికార్జున పరిస్థితిని సమీక్షించారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య


బోయ పరిమళ (ఫైల్)

కోడుమూరు రూరల్: భర్త పెట్టే వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బైన్‌దొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. కోడుమూరు మండలంలోని బైన్‌దొడ్డి గ్రామానికి చెందిన బోయ చిన్న గుడ్డెన్న తన రెండో కుమార్తె బోయ పరిమళ(21)ను గోనెగండ్ల మండలంలోని హెచ్.కైరవాడికి చెందిన శ్రీనివాసులుకిచ్చి రెండేళ్ల కిందట వివాహం చేశారు. వివాహమైన 6 నెలల పాటు వీరి కాపురం సజావుగా జరిగినప్పటికీ అనంతరం శ్రీనివాసులు నిత్యం మద్యం సేవిస్తూ భార్య పరిమళను వేధింపులకు గురి చేసేవాడు. పరిమళ ఒక బాబుకు జన్మనిచ్చినా భర్త శ్రీనివాసులులో ఎలాంటి మార్పు రాలేదు. మద్యం సేవించి వచ్చి వేధిస్తుండడంతో గత వారం హెచ్.కైరవాడి గ్రామానికి వెళ్లి కుమార్తె పరిమళను తండ్రి చిన్న బుడ్డెన్న బైన్‌దొడ్డికి పిలుచుకుని వచ్చాడు. అయితే శ్రీనివాసులు తన 11నెలల కుమారుడిని లాక్కొని పరిమళను మాత్రమే పుట్టింటికి పంపాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన పరిమళ సోమవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వచ్చేసింది. అయితే ఎక్కడికైనా దేవాలయాలకు వెళ్లిందేమోనని తల్లిదండ్రులు పలు చోట్ల వెతికారు. ఈనేపథ్యంలో ఊరి సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో మంగళవారం సాయంత్రం శవమై తేలింది. విషయం తెలుసుకున్న కోడుమూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని బావిలో నుంచి తీసి పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు భర్త శ్రీనివాసులుపై వేధింపుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామి వార్ల ఆలయప్రాంగణంలో శుక్రవారం ముత్తైదువులకు శుభాలను చేకూర్చే వరలక్ష్మీవ్రతాన్ని సామూహికంగా నిర్వహించడానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. శ్రావణ రెండవ శుక్రవారం, శ్రావణ నాల్గవ శుక్రవారం రోజున సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తారు. శ్రావణ రెండవ శుక్రవారం రోజున 750 మందికి , తెల్లరేషన్‌కార్డు కలిగిన 250 మందికి మొత్తం వెయ్యి మంది ముత్తైదువులకు, నాల్గవ శుక్రవారం 500 మంది చెంచు ముత్తైదువులకు, 500 మంది దాకా ఇతర భక్తులకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కాగా ఈ సామూహిక వ్రతంలో పాల్గొనదలచిన ముత్తైదువులు గురువారం ఉదయం 10 గంటలకు నుంచి దేవస్థానం కార్యాలయంలోని ప్రచురణల విభాగంలో పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు.

భారీగా మద్యం పట్టివేత


పట్టుబడిన మద్యం బాటిళ్లు, నిందితుడితో పోలీసులు

బనగానపల్లె: పట్టణంలోని శ్రీనివాస పాల కేంద్రం వద్ద ఒక గదిలో నిల్వ ఉంచిన111 ఆర్మీ మద్యం బాటిళ్లను బుధవారం సెబ్ పోలీసులు పట్టుకున్నారు. శ్రీనివాస మిల్క్ డైరీలో సూపర్‌వైజర్‌గా పని చేసే యాగంటిపల్లె గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి బయట అధిక ధరలకు విక్రయించేందుకు వాటిని తెప్పించాడు. ఈమేరకు సమాచారం అందడంతో సెబ్ స్టేషన్ ఎస్ఐ దౌలత్‌ఖాన్ దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టుబడిన మద్యం రూ.2.20 లక్షలు విలువ చేస్తుందని ఎస్ఐ వెల్లడించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారి లక్ష్మణ్‌దాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య


మృతి చెందిన రవితేజ

ఆదోనిరూరల్ : మండలంలోని బల్లేకల్ గ్రామానికి చెందిన రవితేజ (18) అనే డిప్లొమా విద్యార్థి బుధవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని పెద్దతుంబళం ఎస్ఐ చిన్నపీరయ్య తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన పరమేష్, నాగలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. రెండో కుమారుడైన రవితేజ ఆలూరు రోడ్డులోని భీమా డిప్లొమా కాలేజీలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. మొదటి సంవత్సరం పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టు పక్కల వారు గమనించి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

కుమారుడితో సహా తల్లి అదృశ్యం


అదృశ్యమైన రేష్మ, మహబూబ్ బాష (ఫైల్)

గోనెగండ్ల: స్థానిక అచ్చుకట్ల వీధికి చెందిన రేష్మ (24), ఐదేళ్ల కుమారుడు మహబూబ్ బాషతో కలిసి జూన్ 4వ తేదీన అదృశ్యమైనట్లు ఎస్ఐ తిమ్మారెడ్డికి బుధవారం ఫిర్యాదు అందింది. అదృశ్యమైన రోజు నుంచి కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లు, పలు చోట్ల వేతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో తండ్రి ముల్లా చాంద్ బాషా గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.



ఆచంద్ర తారార్కం ఈ మహిళల కీర్తి

'ఇస్రో'లో పనిచేసిన తొలి తరం మహిళా శాస్త్రవేత్తల మాటల్లో తరచు వినిపించే మాట... 'ఆరోజుల్లో ఇస్రోలో చా...లా తక్కువ మంది మహిళలు ఉండేవారు'
చంద్రయాన్-3కి సంబంధించి నిన్నటి ప్రత్యక్ష ప్రసారాన్ని గమనిస్తే... ఆ ప్రాజెక్ట్‌లో భాగమైన ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉత్సాహంగా కనిపిస్తారు.
మార్పు స్పష్టంగా కనిపిస్తుంది.
అది సంఖ్యాబలమే కాదు సామర్థ్య బలం కూడా.
'ఇస్రో' సాధించిన ఎన్నో విజయాలలో మహిళా శాస్త్రవేత్తలు భాగం అయ్యారు.
ముఖ్యంగా 'చంద్రయాన్-3' ప్రాజెక్ట్‌లో రీతూ కరిధాల్ నుంచి కల్పనా కాళహస్తి వరకు ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు మేధోశ్రమ చేశారు. చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నారు.
'ఇస్రో సైంటిస్ట్ కావాలనుకుంటున్నాను' అని కలలు కనే ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చే అసాధారణ విజయ గాథలు ఇవి.

రాకెట్ ఉమన్: రీతూ కరిధాల్



అన్ని దశలను పూర్తి చేసుకొని విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టిన క్షణం ఒక చారిత్రక సందర్భం. ఎంత కృషి చేస్తే ఒక విజయం సొంతం అవుతుందో చెప్పిన సందర్భం.

అమోఘమైన చారిత్రక విజయాన్ని దేశానికి అందించిన 'చంద్రయాన్-3'లో భాగమైన అనేకమంది మహిళలలో రీతు కరిధాల్ ఒకరు.

గత నెలలో...

మూడు దశలను పూర్తి చేసుకొని చంద్రయాన్-3 విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి దూసుకెళ్లిన తరువాత ఉత్తర్‌ప్రదేశ్‌లో లక్నోలోని ఒక ఇంట్లో ఆనందం అంబరాన్ని తాకింది. వారు ఆనందంతో బాణాసంచా కాల్చారు. మిఠాయిలను చుట్టుపక్కల వారికి పంచారు. ఇక నిన్నటి రోజు ఆ ఆనందం స్థాయి ఎల్లలు దాటి ఉండవచ్చు. ఇది కోట్లాదిమంది భారతీయుల ఇంట్లో కనిపించే సాధారణ దృశ్యమే కావచ్చు.

కాని ఆ ఇంటికి ఒక ప్రత్యేకత ఉంది.

ఆ ఇంట్లో పుట్టిన రీతూ కరిధాల్ ప్రసిద్ధ చంద్రయాన్-3 మిషన్ డైరెక్టర్.

మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రీతుకు ఆకాశం అంటే అంతులేని ఆసక్తి. అదేపనిగా నింగిలోకి చూసేది. ఏవేవో ఊహించుకునేది. అప్పటికి అవి శాస్త్రీయతకు నిలవని ఊహలు కావచ్చు. అయితే రీతూ కరిధాల్ శాస్త్రీయ రంగంలో దిగ్గజంగా వెలగడానికి ఉపకరించిన ఊహలు.

కట్ చేస్తే....

1997... భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లోకి అడుగు పెట్టింది రీతు. చంద్రుడిపై అడుగు పెట్టినంత ఆనందంగా అనిపించింది. 'ఇస్రో' గురించి వింటూ, చదువుతూ పెరిగిన రీతు అదే 'ఇస్రో'లో 'మిషన్ ఎనాలసిస్ డివిజన్'లో ఉద్యోగిగా చేరింది. అప్పట్లో 'ఇస్రో'లో తక్కువ మంది మహిళలు పనిచేసేవారు.

ఎక్కడికి వెళ్లినా ఒంటరిగానే వెళ్లేది. ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేయాల్సి వచ్చేది.

అయినా సరే, ఎప్పుడూ భయపడేది కాదు.

అసలు సిసలు భయం మాత్రం తొలి టాస్క్ రూపంలో ఎదురైంది.

'నేను చేయగలనా?' అని మొదట ఆందోళన పడింది రీతు.

చేతులెత్తేయడం తేలిక. 'చేయగలను' అనుకోవడం కష్టం. అయితే కష్టపడే వారే విజేతలవుతారు.'యస్ నేను చేయగలను' అంటూ తొలి టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేసి 'భేష్' అనిపించుకుంది.

'నాకు అప్పగించిన టాస్క్‌ను సీనియర్‌లు చేసే అవకాశం ఉన్నప్పటికీ నన్ను వెదుక్కుంటూ వచ్చింది. ఇది నన్ను పరీక్షించడానికి వచ్చిందా? అదృష్టవశాత్తు వచ్చిందా? అనేది తెలియదుగానీ నా విజయానికి కారణం... ఫిజిక్స్, మ్యాథమేటిక్స్ చదువుకున్నాననే ధైర్యం కంటే నాపై నాకు ఉన్న ఆత్మవిశ్వాసం' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటుంది రీతు.

ఆ ఆత్మవిశ్వాసం అప్పుడే కాదు ఇప్పటికీ రీతు వెన్నంటే ఉంది. ఆ ఆత్మవిశ్వాసమే ప్రతిష్ఠాత్మకమైన 'మంగళయాన్ మిషన్'లో డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా, చంద్రయాన్-2 మిషన్ డైరెక్టర్‌గా పనిచేయడానికి ఇంధనంగా మారింది. చంద్రయాన్-3తో రీతూ కరిధాల్ ఒక చారిత్రక విజయంలో భాగం అయింది.

శాస్త్రవేత్తలు కావాలనుకునే కలలు కనే అమ్మాయిలకు రీతు కరిధాల్ స్ఫూర్తి ఇస్తుంది.

'నా విజయ మంత్రం ఇది' అని ఆమె ఎప్పుడూ ప్రత్యేకంగా చెప్పలేదుగానీ పరోక్షంగా వినిపించే మాట...టైమ్ మేనేజ్‌మెంట్.

కాలం విలువ తెలిసిన వారే 'టైమ్ మేనేజ్‌మెంట్'ను ఇష్టంగా ఆచరిస్తారు. ఆ ఆచరణే ఎన్నో విజయాలను బహుమానంగా ఇస్తుంది.

స్ఫూర్తిదాయక శక్తిమంతులు


● మహిళా శాస్త్రవేత్తలు, సిబ్బంది వేడుక

స్పేస్ మిషన్‌లలో భాగమైన మహిళా శాస్త్రవేత్తల గురించి మిన్నీ వేద్ 'దోజ్ మాగ్నిఫిసియెంట్ ఉమెన్ అండ్ దెయిర్ స్టోరీస్' అనే స్ఫూర్తిదాయకమైన పుస్తకాన్ని రాసింది. ఈ పుస్తకంలో 'రాకెట్ ఉమెన్'గా పేరు గాంచిన రీతూ కరిధాల్ సక్సెస్ స్టోరీ కూడా ఉంది. 'కుటుంబ జీవితం, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాను. వృత్తిపరమైన విజయాలకు కుటుంబమే పెద్ద బలం' అంటుంది రీతు.

'ఇస్రో'లో రీతులాగే ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉన్నతస్థానాల్లో ఉన్నారు. అయితే ఇది రాత్రికి రాత్రి వచ్చిన విజయం కాదని వారి ప్రయాణాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. 'ఇస్రో'లో పనిచేయాలని అనుకోవడానికి కారణం నుంచి... ఎదుర్కొన్న ఒత్తిళ్ల వరకు వారి మాటల్లో కనిపిస్తాయి.

ఇస్రో స్పేస్ సైన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా పని చేసిన సీతా సోమసుందరం ఇలా అంటోంది...

'నేను ఇస్రోలో చేరిన కాలంలో ఇంజనీరింగ్, సైన్స్‌లలో మహిళలు చాలా తక్కువ మంది ఉండేవాళ్లు. కొందరు సీనియర్‌లకు కొన్ని అభిప్రాయాలు ఉండేవి. అందులో ఒకటి... మహిళలు ఎక్కువగా కష్టపడలేరు. పరిమిత పని గంటల్లోనే పనిచేయగలరు. ఇంటికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. అంకితభావం ఉండదు. అయితే ఇది తప్పుడు భావన అని ఇస్రోలో ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు నిరూపించారు'. 'ఏదో ఉద్యోగం చేస్తున్నాను అనే భావన కాకుండా విజయంలో భాగం కావాలనే సంకల్ప బలం మహిళా శాస్త్రవేత్తలలో కనిపిస్తుంది. ఎన్నో విజయాలలో నిర్ణయాత్మకమైన పాత్ర పోషించారు. డెడ్ లైన్‌లను సవాలుగా తీసుకోవడం నుంచి మిషన్, నేవిగేషన్, కమ్యూనికేషన్, కంట్రోల్ సిస్టమ్, స్పేస్ క్రాఫ్ట్ డిజైన్, ట్రాకింగ్ లాంటి మేజర్ ఏరియాలలో కీలక పాత్ర పోషించి తమ సత్తా చాటారు' అంటుంది మంగళ్‌యాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేసిన ఎస్.అరుణ. స్పేస్ సైంటిస్ట్‌లు అనగానే ఏవో గంభీరమై ఊహలు తారసపడతాయి. అయితే ఈ ఉమెన్ స్పేస్ సైంటిస్ట్‌ల మాటలు విన్న తరువాత 'అందరిలాగే సాధారణ జీవితం... కానీ అసాధారణ సంకల్ప బలం' అనే సత్యం ఆవిష్కారం అవుతుంది. 'ఇస్రోకు ఛైర్ ఉమన్ (ఛైర్ పర్సన్) ఎప్పుడూ?' అనే ప్రశ్న వస్తుంటుంది. 'ఇస్రో' విజయాలలో భాగం అవుతున్న మహిళల అంకితభావాన్ని చూస్తే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పే రోజు ఎంతో దూరంలో లేదు' అనిపిస్తుంది. 'ఇస్రో'లో జెండర్-న్యూట్రల్ ప్రొఫెషనల్ ఎన్విరాన్‌మెంట్ ఉంటుందనే మంచి మాటలు కూడా దీనికి కారణం.

కొన్నిసార్లు లోతైన భావాలు పలకడానికి పదాలు, పుస్తకాలు తెల్లముఖం వేస్తాయి. కళ్లు మాత్రమే నిశ్శబ్దంగా చెబుతాయి. చంద్రయాన్-3 ల్యాండింగ్‌కు సంబంధించి నిన్నటి టీవీ ప్రత్యక్ష ప్రసారంలో మహిళా శాస్త్రవేత్తల కళ్లలో కనిపించిన ఉత్సాహాన్ని, అంకితభావాన్ని గమనిస్తే ఇంకా ఎన్నో విజయాలు వారి కోసం ఎదురు చూస్తున్నాయని అనిపిస్తుంది.

సంతోష క్షణాలు: కల్పనా కాళహస్తి



కల్పనా కాళహస్తిది ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా. చెన్నైలో బి.టెక్ (ఈసీఈ) చదివారు. తండ్రి మద్రాసు హైకోర్టులో ఉద్యోగి. తల్లి గృహిణి. ఇస్రోలో పనిచేయాలని తన చిన్ననాటి నుంచి కలలు కనేది. అనుకున్నట్టుగానే 2000 సంవత్సరంలో ఇస్రోలో చేరారు. తొలుత శ్రీహరికోటలో ఐదేళ్ల పనిచేశాక బెంగళూరులోని శాటిలైట్ సెంటర్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కరోనా పాండమిక్ సమయంలో అనేక అవాంతరాలు వచ్చినప్పటికీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటూ 'చంద్రయాన్-3' మిషన్‌లో అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈమె గతంలో చంద్రయాన్-2, మంగళయాన్ ప్రాజెక్టుల్లోనూ కీలక బాధ్యతల్ని నెరవేర్చారు. ఆమె నైపుణ్యం, అంకితభావం, దూరదృష్టి వంటివి మిషన్ విజయవంతం కావడంతో గణనీయంగా తోడ్పడ్డాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇవి చాలా సంతోషభరితమైన క్షణాలుగా ఎప్పటికీ ఉండిపోతాయి. చంద్రయాన్ 2 కాలం నుంచి లభ్యమైన ఎన్నో అనుభవాలతో ఈ మిషన్‌ను లోప రహితంగా రూపొందించాం అని చెప్పారు.

వినిపించే గొంతుక: పి.మాధురి



శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ స్టేషన్ నుంచి ప్రజలకు బయటికి కనపడే అక్కడి సిబ్బంది/ సైంటిస్టుల్లో పిల్లల మాధురి ఒకరు. ఈమె షార్‌లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. రాకెట్ లాంచింగ్ సమయంలో వినిపించే వ్యాఖ్యానాలు, ప్రజలకు వివరించే అంశాల గొంతుక ఆమెదే.

వీళ్లే కాకుండా చంద్రయాన్-3 మిషన్‌లో మొత్తం 54 మంది మహిళా సైంటిస్టులు / ఉద్యోగులు / సిబ్బంది ఉన్నారు. వీళ్లలో చాలా మంది మహిళలు ఎంతో కీలకమైన బాధ్యతలు నెరవేర్చే డిప్యూటీ డైరెక్టర్ స్థాయి నుంచి ప్రాజెక్ట్ డైరెక్టర్ స్థాయి నుంచి అనేక స్థాయుల్లో పనిచేస్తూ... కీలకమైన, భారత్‌కు గర్వకారణమైన ఈ ప్రాజెక్టును విజయవంతం చేశారు.

సౌమ్యంగా సాధించింది



సౌమ్య ఈ తరం టెకీ. సాంకేతికతను ఆరోగ్యానికి అద్దింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో వైద్యరంగంలో కొత్త ఒరవడి తెచ్చింది.

వైద్యరంగం, ఔషధాల తయారీ రంగాలు సాంకేతికతను అందుకోవాల్సినంత వేగంగా అందుకోవడం లేదనుకుంది సౌమ్య. 'మల్టిప్‌లెయిర్ ఏఐ' పేరుతో హెల్త్‌కేర్ రంగంలో ప్రవేశించింది. ఇంత సునిశితమైన, సంక్లిష్టమైన పరిశ్రమను నిర్వహించడం మగవాళ్లకే సాధ్యం అనే అభిప్రాయాన్ని చెరిపేసిందామె. 'మగవాళ్ల ప్రపంచం అనే భావన మహిళలు ప్రవేశించేటంత వరకే. ఒకసారి మహిళలు ప్రవేశిస్తే ఇక అది అపోహ మాత్రమేనని నిర్ధారణకు వచ్చేస్తాం. మా టీమ్ లో సగానికి పైగా మహిళలే. సేల్స్ విభాగంలో కూడా మహిళలు సమర్థంగా పని చేస్తున్నార'ని చెప్పింది. ఒక టెకీ హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి దారితీసిన పరిస్థితులను, హైదరాబాద్‌లో సంస్థ స్థాపించి సక్సెస్ అందుకున్న వైనాన్ని సాక్షితో పంచుకున్నారు సౌమ్య.


● సౌమ్య

భారీ మూల్యం చెల్లించాం

''నన్ను హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి రప్పించిన కారణాలు అత్యంత బాధాకరమైనవి. మాది ఉత్తరప్రదేశ్, ప్రయాగరాజ్ (అలహాబాద్). నాన్న రవిప్రకాశ్ శ్రీవాస్తవ ఐఏఎస్ ఆఫీసర్. నాన్న డయాబెటిస్‌తో బాధపడుతుండేవారు. రొటీన్ టెస్టులు, మెడికేషన్ ఇవ్వడంలో ఎక్కడో పొరపాటు జరిగిపోయింది. మా జీవితాలు భారీ మూల్యం చెల్లించుకున్న పొరపాటు అది. వైద్యుల నిర్లక్ష్యం, రాంగ్ మెడికేషన్ కారణంగా ఆయన హటాత్తుగా ప్రాణాలు వదిలారు. నేనప్పుడు బీటెక్ సెకండియర్‌లో ఉన్నాను. ఆ తర్వాత కొద్దిసంవత్సరాల్లోనే అమ్మకు ఒవేరియన్ క్యాన్సర్ ఉన్నట్లు తెలిసింది. మేము తెలుసుకునేటప్పటికే వ్యాధి మూడవ దశకు చేరింది. చికిత్స మొదలు పెట్టినప్పటికీ ఆరు నెలలకే అమ్మను కూడా కోల్పోయాను. అలాంటి దయనీయమైన పరిస్థితుల్లోనే బిట్స్ పిలానీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటీలో బయోటెక్నాలజీలో మాస్టర్స్ చేశాను. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కానీ వైద్యరంగం ఆ వేగాన్ని అందిపుచ్చుకోవడంలో వెనకబడుతోంది. ఆ వెనుకబాటు తెచ్చిన నష్టంలో మా అమ్మానాన్నల మరణాలు కూడా భాగమేననిపించింది. ఈ రెండు రంగాల మధ్య ఉన్న అంతరాన్ని భర్తీ చేయాలనే సంకల్పం కలిగింది, చేయగలననే నమ్మకం కూడా. సమాచారలోపం తలెత్తని విధంగా మెడికల్ డాటాను పరిరక్షించగలిగే పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకున్నాను. మల్టిప్‌లెయిర్ ఏఐ స్థాపించి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా డాటా అనలైజేషన్, డాటా మెయింటెయిన్ చేస్తున్నాం. మా సంస్థకు 'ఐఎస్ఓ 27001' సర్టిఫికేట్ వచ్చింది. మా సర్వీస్‌ను దేశవిదేశాల్లో పెద్ద ఆరోగ్య సంస్థలు తీసుకుంటున్నాయి. పేషెంట్ కేర్‌లో మొదటిది పేషెంట్ ఆరోగ్య చరిత్ర, క్రమం తప్పని పరీక్షల ద్వారా వ్యాధులను తొలిదశలోనే గుర్తించడం, పరీక్షల నివేదికల నిర్వహణ ప్రధానమైనవి. ఇక్కడ పొరపాటు జరిగితే ప్రాణాలు దక్కవని చెప్పడానికి మా పేరెంట్సే ఉదాహరణ.

ఫాలో అప్ సర్వీస్

వ్యాధి నిర్ధారణ ఆధారంగా వైద్యం అందించిన తర్వాత తదనంతర పరీక్షలను, వైద్యాన్ని అందించాల్సిన సమయానికి ఫాలో అప్ చేయడం కూడా మా సర్వీస్‌లో భాగంగా ఉంది. అలాగే భవిష్యత్తులో టెలిమెడిసిన్ విస్తరించాల్సిన అవసరం ఉంది. వైద్యచికిత్సను కుగ్రామాలకు చేరడానికి చక్కటి మాధ్యమం ఇది. పేషెంట్‌ను ఉన్న చోటనే ఉంచి ఆరోగ్యపరిస్థితిని మానిటర్ చేయడం సాధ్యమవుతుంది. నేను చదివిన టెక్, బయోటెక్ పరిజ్ఞానం ఇందుకు దోహదం చేసింది. నాకు సవాళ్లు ఎదురయ్యాయా అంటే సవాళ్లు లేని ప్రొఫెషన్ అంటూ ఏదైనా ఉంటుందా? డిజిటల్ బ్రాండింగ్, మార్కెటింగ్‌లో అవరోధాలు వచ్చాయి. మా క్లయింట్ల సందేహాలను తీరుస్తూ, వాళ్లు సమాధానపడే వరకు సహనంగా వివరించాం. సవాళ్లకు సమాధానాలు వెతుక్కుంటూ ముందుకు పోవడమే సక్సెస్‌కు దారి తీస్తుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మా నాన్నను కోల్పోవడమే నన్ను ఈ రంగం వైపు నడిపించింది. ప్రతి విజయంలో మా అమ్మానాన్న కనిపిస్తున్నారు'' అని వివరించారు సౌమ్య.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

అందంగా పెంచుకుందాం!

బ్యూటిప్స్





గోళ్లు ..పొడవుగా అందంగా ఉండే ఉండాలని ప్రతి అమ్మాయి కోరుకుంటుంది. కానీ కొందరిలో కొద్దిగా పెరగగానే విరిగిపోతుంటాయి. కొంతమందికి అసలు పెరగవు. దీంతో నెయిల్ పెయింట్ వేసుకోవాలంటే ఇబ్బంది. గోళ్లను చక్కగా పెంచే ఈ ఐదు చిట్కాలు పాటించి చూడండి మీ కోరిక తీరుతుంది..

- గోళ్ల పెరుగుదలను ప్రోత్సహించడంలో ఆలివ్ ఆయిల్ ముందుంటుంది. దీనిలోని విటమిన్ ఇ గోళ్లకు పోషణ అందించి చక్కగా పెరిగేలా చేస్తుంది. రాత్రి పడుకోబోయే ముందు కొద్దిగా ఆలివ్ ఆయిల్‌ను గోళ్లమీద రాసి మర్దన చేయాలి. రోజూ ఇలా చేయడం వల్ల గోళ్లకు రక్తప్రసరణ చక్కగా జరిగి గోళ్లలో పెరుగుదల కనిపిస్తుంది.
- టీస్పూను యాపిల్ సైడర్ వెనిగర్‌లో టీస్పూను వెల్లుల్లి తరుగు వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గోళ్లపై రాసి పదినిమిషాల తరువాత కడిగేయాలి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే గోళ్లు విరగకుండా చక్కగా పెరుగుతాయి.
- వెల్లుల్లి రెబ్బను రెండు ముక్కలు చేసి గోళ్లపై పదినిమిషాలపాటు రుద్దాలి. కొద్దిరోజుల్లోనే గోళ్ల పెరుగుదల కనిపిస్తుంది.
- ఆరెంజ్ జ్యూస్‌ను గోళ్లకు పూతలా అప్లైచేసి పదినిమిషాలు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇది గోళ్లను అందంగా పెరిగేలా చేస్తుంది.
- ఇవన్నీ చేయలేకపోతే కొబ్బరినూనెను గోళ్లపై రాసి రోజూ మర్దన చేయాలి. కొబ్బరినూనెలోని ఫ్యాటీ ఆమ్లాలు, ఇతర పోషకాలు గోళ్ల పెరుగుదలకు దోహదపడతాయి.

ఇంటిప్స్







- ఒక్కో నిమ్మకాయను అల్యూమినియం ఫాయిల్‌ల్లో చుట్టి రిఫ్రిజిరేటర్‌లో పెడితే ఎక్కువ రోజులపాటు తాజాగా ఉంటాయి.
- శాండ్ విచ్ మరీ మెత్తగా కాకుండా చక్కగా రావాలంటే... శాండ్ విచ్‌లో పెట్టే కూరగాయలు, బ్రెడ్ మయనేజ్, చీజ్ గది ఉష్ణోగ్రతలో ఉండేలా చూసుకోవాలి. ఇంతకు మించి వేడిగా ఉండే తేమ చేరి శాండ్ విచ్ మెత్తగా మారిపోతుంది.
- కొన్నిసార్లు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత గట్టిగా మారుతుంటాయి. ఇలాంటప్పుడు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత చల్లని నీటిలో ఐదు నుంచి పదినిమిషాలు ఉంచాలి. తరువాత కూరలో వేస్తే పన్నీర్ ముక్క మృదువుగా, మెత్తగా ఉంటుంది.

అబద్ధాలను నమ్ముతున్నారా?!

సైబర్ టాక్



నిజం నిలబడి ఉండగానే అబద్ధం ఊరంతా చుట్టి వస్తుందంటారు.. ఈ సామెత సోషల్ మీడియాలో కుప్పలు తెప్పలుగా పుట్టుకువచ్చే ఫేక్‌న్యూస్ విషయంలో సరిగ్గా సరిపోలుతుంది. ఈ ఫేక్ న్యూస్ వల్ల నిజమేదో తెలుసుకోవడం కష్టంగా మారింది. అబద్ధాన్ని నిజం అనుకునే ప్రమాదమూ ఉంటోంది. అలాగే.. ఫొటోలు, వీడియోలు కూడా ఫేక్‌వి పుట్టుకొస్తున్నాయి. లైవ్ వీడియోలోనూ ఇటీవల ఏఐ టెక్నాలజీ ద్వారా అబద్ధం కొత్తగా సోషల్‌మీడియాను ఏలుతోంది. నిజమేంటో తెలుసుకోవడానికి మనం చాలా ప్రయత్నాలు చేయాల్సి ఉంటోంది. ఎందుకంటే, అబద్ధాల వల్ల కలిగే మోసాలు ఎన్నో. వాటి బారిన పడకుండా జాగ్రత్త పడాలంటే ముందుగా నిజాలేమిటో తెలుసుకుందాం...

వార్తలకు సంబంధించిన సమాచారం, డేటా, నివేదికలు పూర్తిగా నిజమైనవి కానివి ప్రజల ముందుకు వస్తున్నాయి. అందుకని, మూలాధారాలు లేకుండా వచ్చిన సమాచారం అవాస్తవం అని గ్రహించాలి. అబద్ధపు వార్తలు విస్తృతంగా షేర్ అవుతుంటాయి. వీటికి ఎలాంటి సెన్సార్‌షిప్ ఉండదు.

నకిలీ వార్తల పుట్టుకకు..

తమకు తెలిసిన విషయాన్ని నలుగురికి తెలియజేయాలనే ఆత్రుత. స్వీయ లాభం, రాజకీయ ప్రభావం వల్ల ఇలాంటివి జరుగుతుంటాయి. కేవలం తమకు తెలిసినవి మరికొందరికి తెలియజేద్దామని నిజానిజాలు తెలుసుకోకుండా కొందరు అదేపనిగా షేర్ చేస్తుంటారు. సమాచారం అబద్ధమే కావచ్చు కానీ, దానిని షేర్ చేసే వ్యక్తి అది నిజమని నమ్ముతారు. తప్పుడు సమాచారం అని తెలిసీ ఉద్దేశపూర్వకంగానే షేర్ చేస్తారు. ఏదైనా సమస్యకు లేదా వ్యక్తికి సంబంధించిన కంటెంట్ అబద్ధమైతే మనల్ని ఆ వార్త తప్పుదారి పట్టించవచ్చు. ముఖ్యాంశాలు, విజువల్స్, క్యాప్షన్‌లు కంటెంట్‌కు సరిపోని విధంగా ఉంటాయి. మోసగించడానికి ఫొటోలు, కంటెంట్‌ను తారుమారు చేస్తుంటారు.

తనిఖీ చేసే విధానం..

- వీడియో మూలం ఎక్కడ ఉందో చెక్ చేయాలి. అది విశ్వసనీయమైనదే అని నిర్ధారించుకోవడానికి ప్రయత్నించాలి.
- సమాచారం నిజమైనదైనా ప్రత్యామ్నాయంగా ఇతర మూలాధారాల కోసం వెతకాలి.
- వీడియోలో అసహజమైన కదలికలు ఉన్నాయేమో గమనించాలి.
- డీప్ ఫేక్స్ గుర్తించడానికి 'డీప్ ఫేక్ డిటెక్షన్ మోడల్' వంటి స్పెషల్ సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉంది.
- వీడియోలోని సంఘటనలు నమ్మదగినవేనా? ఆ వీడియో ఏ సందర్భాన్ని బట్టి తీశారో ఆ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి.
- వీడియోలో ఉన్న వ్యక్తిని మెయిల్, ఫోన్ ద్వారా సంప్రదించి, ప్రామాణికతను ధృవీకరించుకోవడానికి ప్రయత్నించవచ్చు.

వాస్తవం తెలుసుకోవాలంటే..

- గూగుల్ రివర్స్ ఇమేజ్ చెక్ చేయాలి. లేదా ఫొటో వెరిఫికేషన్ కోసం www.tineye.comని ఉపయోగించాలి.
- ఫొటో లేదా వీడియో (https://www.invid-project.eu/tools-and-services/invid-verification-plugin/) కోసం ఇన్‌విడ్ టూల్‌కిట్ ఎక్స్‌టెన్షన్‌ని ఇన్‌స్టాల్ చేయాలి.
- ఫార్వర్డ్ చేసే ముందు ఏదైనా ఒక అంతర్జాతీయ ఫాక్ట్-చెకింగ్ నెట్‌వర్క్ ఆర్గనైజేషన్‌తో www.factly.in వాస్తవాన్ని చెక్ చేయాలి.

ఇలా గుర్తించాలి...

డీప్ ఫేక్ వీడియో లేదా ఆడియోలో ఏవైనా లోపాలు ఉన్నాయేమో జాగ్రత్తగా పరిశీలించడం, వినడం చేయాలి.

- డీప్ ఫేక్ వీడియో లేదా ఫొటోలలో లైటింగ్ నీడలను చెక్ చేయాలి. కొన్నింటిలో నీడలు కచ్చితంగా కనిపించకపోవచ్చు. ఇవే కాకుండా ఇంకేమైనా లోపాలు ఉన్నాయేమో చెక్ చేయాలి.
- వీడియోలలోని బ్యాక్‌గ్రౌండ్ చెక్ చేయాలి. సబ్జెక్ట్‌కు వీడియోలోని వ్యక్తుల కదలికల సరిపోలకపోవచ్చు. అంటే, ఏఐ టెక్నాలజీ ద్వారా నకిలీ వ్యక్తుల సృష్టి అయి ఉండవచ్చు.
- వీడియోలో వ్యక్తి కనురెప్పలు ఆర్పుతున్నారో లేదో పరిశీలించాలి.
- లైవ్ వీడియోలో మాట్లాడుతున్నప్పుడు ముఖాన్ని ఎడమ లేదా కుడికి కదిలించమని సదరు వ్యక్తిని ఉద్దేశించి అడగాలి.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్